క్లుప్తంగా

శారదామాతకు పుష్పాభిషేకం



నల్లకుంట: పౌర్ణమి సందర్భంగా నల్లకుంట శంకరమఠం భక్తులతో పోటెత్తింది. ఈ సందర్భంగా శక్తి గణపతికి ఆదిపూజ చంద్రమౌళీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకస్వాముల మంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారికి పుష్పాభిషేకం చేశారు. అనంతరం మఠం ప్రాంగణంలోని యాగశాలలో చండీ హోమం పూర్ణాహుతి కావించారు. మధ్యాహ్నం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

చట్ట సభల్లో బీసీల రాజకీయ ప్రాధాన్యత పెరగాలి

కాచిగూడ: దేశ జనాభాలో 70 కోట్ల మందికి పైగా ఉన్న బీసీల రాజకీయ ప్రాతినిధ్యం 50 శాతానికి పెరగాలని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ అన్నారు. శనివారం కాచిగూడలోని బీసీ మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయ న మాట్లాడుతూ.. పార్లమెంట్, అసెంబ్లీలో బీసీ ల రాజకీయ ప్రాతినిధ్యం ఏనాడు 14 శాతానికి మించి దాటడం లేదన్నారు. దేశంలో 2600 బీ సీ కులాలు ఉండగా.. 2520 కులాలు ఈరోజు వరకు చట్ట సభలలోకి అడుగు పెట్టలేదన్నారు. డాక్టర్ ప్రశాంత్ నిమ్‌కర్, నల్లెల కిషోర్, సీహెచ్ ప్రదీప్ గౌడ్, భూషన్ భాస్కర్, ధరణీధర్‌యాదవ్, పులిజాల కృష్ణ తదితరులున్నారు.

మిల్లెట్స్ పదార్థాల వితరణ

నల్లకుంట: మాతా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక శంకరమఠం సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద శనివారం మిల్లెట్స్ ఉప్మా, రాగి అంబలి, మజ్జిగ వితరణ చేశారు. దీనికి అతిథులుగా హాజరైన సెన్సార్ బోర్డు సభ్యుడు ఉపేందర్, పాత్రికేయుడు కె.నర్సింహ బాటసారులకు మిల్లెట్స్ అల్పాహారం పంపిణీ చేశారు. వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మరమ్మతు పనుల పరిశీలన

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ అరుంధతినగర్, సబర్మతినగర్‌కు వెళ్లే దారిలో ప్రధాన రహదారిపై నూతనంగా ఏర్పాటు చేసిన వీడీసీసీ రోడ్డు కుంగిపోయి గుంతలమయంగా మారడంతో మరమ్మతు పనులను జీహెచ్‌ఎంసీ సిబ్బంది చేపట్టారు. గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ సమస్యను గుర్తించి జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో చర్చించి రోడ్డు మరమ్మతు పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. పనుల్లో నాణ్యత లోపం కారణంగా రోడ్డుపై గుంతలు ఏర్పడి దెబ్బతింటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేత్ర పర్వంగా ధ్వజారోహణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చిక్కడపల్లి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ధ్వజారోహణ కార్యక్రమం నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయం వ్యవస్థాపక వంశీయులు శ్రీనాథ్, ఈఓ రామాంజనేయులు ఆధ్వర్యంలో జరిగాయి. ఈ ఉత్సవాల సందర్భంగా స్వామివారిని శేష వాహనంపై తిరు మాడ వీధుల్లో ఊరేగించారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

కవాడిగూడ: భోలక్‌పూర్ డివిజన్‌లోని బంగ్లాదేశ్ మార్కెట్‌లో జనావాసాల రాకపోకలకు ఆటంకం కలిగించేలా అక్రమంగా నిర్మించిన కట్టడాలను జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. శనివారం జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మంజుసింగ్ పర్యవేక్షణలో ముందస్తు జాగ్రత్తగా భారీ బందోబస్తు మధ్య కూల్చివేశారు. బంగ్లాదేశ్ మార్కెట్‌లో జనావాసాలు ఉండే ప్రాంతంలో వ్యాపార సముదాయానికి అక్రమంగా కట్టడం చేపట్టడంతో స్థానికులు అహ్మద్ ఉస్మాన్, నస్రీన్‌పాషా, అక్బర్‌ల ఫిర్యాదు మేరకు జీహెచ్‌ఎంసీ అధికారులు కూల్చివేత పనులను చేపట్టారు. ఈ సందర్భంగా టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మంజుసింగ్ మాట్లాడుతూ.. స్థానికుల ఫిర్యాదు మేరకు అక్రమ నిర్మాణదారులకి నోటీసులు జారీ చేశామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే ఎంతటి వారినైనా సహించేది లేదని హెచ్చరించారు. జీహెచ్‌ఎంసీ సెక్షన్ ఆఫీసర్లు రాజయ్య, హఫీజ్ తదితరులున్నారు.

దళిత బంధు దళారులపై చర్యలు తీసుకోవాలి

ముషీరాబాద్: దళిత బంధులో కమిషన్లు దండుకున్న ఎమ్మెల్యేలు, నాయకుల పేర్లు బయట పెట్టి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ సీనియర్ నాయకులు గానుకపాటి సూర్యనారాయణశర్మ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం విద్యానగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం, చట్టబద్ధంగా దళిత బంధును దళితులకే ఇవ్వాలన్నారు. నిజమైన అర్హులు సమాజంలో అనేక మంది దళితులు ఉన్నారని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగబద్ధ హక్కుతో కేసీఆర్ దళిత బంధును ప్రకటించారన్నారు. కానీ అందులో కూడా అవినీతి జరుగుతోందని స్వయంగా ఎమ్మెల్యేలే రూ. 3 లక్షల వరకు తీసుకుంటున్నారని సీఎం ప్రకటించడం విస్మయానికి గురి చేస్తుందన్నారు. పేద దళితులందరికీ దళితబంధు ఇవ్వాలని కమిషన్‌లు దండుకున్న ఎమ్మెల్యేలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

యువత క్రీడాస్ఫూర్తిని పెంచుకోవాలి

- ఎన్టీఆర్ స్టేడియంలో ఘనంగా నాయిని నర్సింహ్మారెడ్డి మెమోరియల్ క్రికెట్ లీగ్–2 పోటీలు
- దేశం, రాష్ట్రానికి యువత పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్న సెంట్రల్ జోన్ డీసీపీ వెంకటేశ్వర్లు



నాయిని చిత్రపటానికి నివాళులర్పించిస్తున్న పోలీసులు ఉన్నతాధికారులు వెంకటేశ్వర్లు, జగదీష్

కవాడిగూడ: యువతీయువకులు విద్యతో పాటు క్రీడా నైపుణ్యాన్ని పెంచుకుని దేశం, రాష్ట్రానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకొచ్చేందుకు కృషి చేయాలని సెంట్రల్ జోన్ డీసీపీ వెంకటేశ్వర్లు, రాజేంద్రనగర్ జోన్ డీసీపీ జగదీష్‌లు సూచించారు. శనివారం ఎన్టీఆర్ స్టేడియంలో రాష్ట్ర తొలి హోంశాఖ మంత్రి దివంగత నాయిని నర్సింహ్మారెడ్డి జయంతిని పురస్కరించుకుని నాయిని నర్సింహ్మారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాయిని నర్సింహ్మారెడ్డి, మెమోరియల్ క్రికెట్ లీగ్–2 నిర్వహిస్తున్న పోటీలకు ఫౌండేషన్ అధ్యక్షురాలు సమతారెడ్డి, ఉపాధ్యక్షుడు నాయిని దేవేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డిలు హాజరై నాయిని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- అనంతరం ఎన్టీఆర్ స్టేడియంలో జరిగే క్రికెట్ లీగ్ పోటీల్లో భాగంగా మొదట గాంధీనగర్, ముషీరాబాద్, చిక్కడపల్లి, నల్లకుంట పోలీస్‌స్టేషన్‌లకు సంబంధించి క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం అతిథులు టాస్‌వేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. క్రీడా రంగంలో గెలుపోటములు సహజమని ప్రతీ క్రీడాకారుడు తమ ప్రతిభను వెలికి తీసి చక్కటి క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించినప్పుడే వారికి బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు.
- ఈ టోర్నమెంట్‌లో మొత్తం 100 క్రికెట్ టీమ్‌లు పాల్గొంటున్నాయని రోజూ 42 టీమ్‌లకు మ్యాచ్‌లు నిర్వహించడం జరుగుతుందని ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.
- మే 12న నాయిని నర్సింహ్మారెడ్డి జయంతి రోజున ఫైనల్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి రూ.లక్ష నగదు, మెమోంటో, రన్నర్‌గా నిలిచిన టీమ్‌కు రూ.50 వేలు మెమోంటో అందజేయనున్నట్లు వివరించారు.
- ఈ క్రికెట్ క్రీడా పోటీలను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యాఖ్యాతగా సూరజ్ వ్యవహరించగా.. చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి, గాంధీనగర్ సీఐ మోహన్‌రావు, ముషీరాబాద్ సీఐ జహంగీర్‌యాదవ్, చిక్కడపల్లి సీఐ సంజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ నేతలు కల్వగోపి, రమేష్, నేత శ్రీనివాస్, సిద్ధిక్, సాయియాదవ్, శివ, కార్తీక్, బాలయ్య, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



ధర్నాచౌక్‌లో మహాధర్నాలో పాల్గొన్న రజక సంఘం ప్రతినిధులు

కవాడిగూడ: రజకులు అన్ని రంగాల్లో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంటున్నారని వారిని వెంటనే ఎస్సీ జాబితాలో చేర్చి న్యాయం చేయాలని అఖిల భారత రజక సంఘం (ఏబీఆర్‌ఎస్) వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు మొగ్గ అనిల్‌కుమార్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చడంతో పాటు తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. శనివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద అఖిల భారత రజక సంఘం ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ.. దళితబంధు ప్రకటించిన విధంగానే సీఎం కేసీఆర్ రజకబంధును కూడా ఇవ్వాలన్నారు. రజకుల అభివృద్ధికి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

- జనగామ జిల్లాకు వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టాలని రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని సీఎం కేసీఆర్ అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేసి తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.
- రజకుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోతే భవిష్యత్తుల్లో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. సంఘం ఉపాధ్యక్షులు ఎ.గణేష్, ప్రధాన కార్యదర్శి సతీష్, కోశాధికారి మహేష్, నాయకులు రమేష్, తిరుపతి, రజక సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై స్పష్ట వైఖరిని తెలపాలి

కవాడిగూడ: బహుజన సమాజ్‌వాదీ పార్టీ అధినేత్రి, యూపీ మాజీ సీఎం మాయావతి రాష్ట్రానికి వస్తున్న సందర్భంగా ఎస్సీ వర్గీకరణపై తమ పార్టీ వైఖరి తెలపాలని ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జ్ వీ.ఎస్.రాజు మాదిగ, ముషీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గజ్జెల రాజశేఖర్‌మాదిగలు డిమాండ్ చేశారు. శనివారం ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులతో ఎస్సీ వర్గీకరణపై బీఎస్‌పీ వైఖరి స్పష్టం చేయాలని డిమాండ్ చేస్తూ.. నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈరోజు సరూర్‌నగర్ గ్రౌండ్‌లో జరిగే తెలంగాణ భరోసా సభలో ఎస్సీ వర్గీకరణకు సానుకూలంగా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. గతంలో అగ్రకులాల్లో పేదల రిజర్వేషన్లకు మద్దతు ఇచ్చినట్లుగా ఎస్సీ వర్గీకరణకు కూడా మద్దతు ఇవ్వాలని బీఎస్‌పీ అధినేత్రి మాయావతికి విజ్ఞప్తి చేశారు. బీఎస్పీ ఎన్నికల మేనిఫెస్టోలో ఎస్సీ వర్గీకరణ అంశాన్ని చేర్చకపోవడంపై మాయావతి పునరాలోచించాలని వారు కోరారు. గణేష్, లలిత, సోమశేఖర్, రేణుకాదేవి, నరసింహారావు, అరుణ్, సుధాకర్, శేఖర్, మహేష్, రవి, బాలకృష్ణ, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను అడ్డుకునేందుకు కుట్ర

ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జి.కరుణాకర్‌రెడ్డి



ముషీరాబాద్: అగ్రవర్ణ పేదలకు అమలవుతున్న ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లను అడ్డుకుంటే మొత్తం రిజర్వేషన్‌ల వ్యవస్థనే రద్దు చేయాలని ఉద్యమిస్తామని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జి.కరుణాకర్‌రెడ్డి హెచ్చరించారు.

- గత మూడేళ్ల క్రితం దేశ వ్యాప్తంగా ఆరు కోట్ల మందికి పైగా ఉన్న అగ్రవర్ణ పేదల కోసం విద్య, ఉద్యోగ రంగాల్లో కల్పించిన 10 శాతం రిజర్వేషన్‌లను అడ్డుకునేందుకు భారీ కుట్ర జరుగుతోందని ఆరోపించారు.
- సామాజిక వివక్షతతో పాటు ఆర్థిక వివక్షత కొనసాగుతున్న నేపథ్యంలో మేజర్ జనరల్ సిన్హా నివేదిక ఆధారంగా 103వ రాజ్యాంగ సవరణ ద్వారా అమలు చేయబడిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లను అడ్డుకునేందుకు కొన్ని శక్తులు కుట్ర పన్నుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.
- ఏ సామాజిక వర్గానికి చెందిన రిజర్వేషన్‌లకు నష్టం కలగకుండా కేవలం అగ్రవర్ణ పేదలకు మాత్రమే అదనంగా పది శాతం విద్య, ఉద్యోగ రిజర్వేషన్లు కల్పించినప్పుడు కొన్ని ప్రజా సంఘాలు రాజకీయ పార్టీలు వ్యతిరేకించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు.
- ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లను సుప్రీంకోర్టు సమర్థిస్తూ.. తీర్పునిచ్చిన కొన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకు రాజకీ యాలకు పాల్పడుతూ.. పునః సమీక్షించాలని కోరుతూ వాజ్యాలు దాఖలు చేయడం విచారకరమన్నారు.
- అగ్రవర్ణ పేదల రిజర్వేషన్‌పై సుప్రీం కోర్టులో ఈ నెల 9 నుంచి 5 మంది సభ్యుల ధర్మాసనం పునః సమీక్షపై విచారణ ప్రారంభిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు న్యాయ నిపుణులను ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లను పరిరక్షించేందుకు కృషి చేయాలన్నారు.
- దేశంలోని అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు అగ్రవర్ణ పేదల రిజర్వేషన్‌లకు మద్దతుగా నిలిచి ఏకాభిప్రాయం సాధించాలని ప్రధాని దీనిపై తక్షణమే అఖిల పక్షం ఏర్పాటు చేసి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ల అమలుకు వివరించి ఐక్యత సాధించాలని కోరారు.

స్వార్థ రాజకీయాలతో ప్రజల మధ్య ఘర్షణలు



పాదయాత్ర నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

ముషీరాబాద్/నల్లకుంట: 'స్వార్థ రాజకీయాల కోసం ప్రజల మధ్య ఘర్షణలు సృష్టిస్తూ.. బీజేపీ, ఎంఐఎంతో కొనసాగిస్తున్న రహస్య ఒప్పందం దేశానికి ప్రమాదకరమని' సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈ.టీ.నర్సింహ్మ ఆరోపించారు. బీజేపేతర ఓట్లు విభజించడం ద్వారా బీజేపీని గెలిపించాలనే కచ్చితమైన లక్ష్యంతో ఎంఐఎం దేశంలోని అన్ని రాష్ట్రాల రాజకీయాల్లోకి అడుగుపెట్టిందని బీజేపీ, ఎంఐఎంల మధ్య చీకటి ఒప్పందం ఉందన్నారు. ప్రజా వ్యతిరేక పాసిస్టు విధానాలకు పాల్పడుతున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని కోరుతూ.. 'బీజేపీ హటావో దేశ్ బచావో' నినాదంతో హైదరాబాద్‌లోని తిలక్‌నగర్, నల్లకుంట, విద్యానగర్, శివంరోడ్డు ప్రాంతాల్లో శనివారం పాదయాత్ర నిర్వహించారు. సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, రాష్ట్ర సమితి సభ్యులు వెంకటేశం సీపీఐ శ్రేణులు పాల్గొని ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శులు యాదగిరి, స్టాలిన్, నగర నాయకులు ఎన్.శ్రీకాంత్, రాజుగౌడ్, వెంకటస్వామి, సీ.హెచ్.శ్రీనివాస్, ఒమర్‌ఖాన్, భూపాల్, లతీఫ్, కల్యాణ్ తదితరులున్నారు.

రోడ్డు సమస్య పరిష్కారానికి చర్యలు

కవాడిగూడ: భోలక్‌పూర్ డివిజన్ రంగానగర్‌లో ప్రజల సౌకర్యార్థం కోసం నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డుతో రహదారి గుంతల మయంగా మారిందని ఈ రహదారిపై వాహనాలు, పాదచారులు వెళ్లడానికి ఇబ్బందులు పడటమే కాకుండా ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు వై.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రహదారి సమస్యను బీఆర్‌ఎస్ నగర నాయకులు ముఠా జైసింహ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన రహదారులను సందర్శించి త్వరలోనే పనులు పూర్తి చేస్తామని బస్తీవాసులకు హామీ ఇచ్చారు. కృష్ణ, ఉమాకాంత్, సాయి, మక్బూల్, అశోక్, ప్రవీణ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నల్లకుంట: అనారోగ్యంతో గుర్తు తెలియని యాచకుడు మృతి చెందిన ఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై అంజయ్య తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం మధ్యాహ్నం 3.37 గంటల సమయంలో ఓ గుర్తు తెలియని యాచకుడు (50) రాంనగర్ గుండు సమీపంలోని ఓ బిల్డింగ్ వద్ద రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి చూడగా.. అతడు అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి బంధువులెవరైనా ఉంటే నల్లకుంట పోలీసులను సంప్రదించాలని కోరారు.

వ్యక్తి అదృశ్యం



రాజశేఖర్ (ఫైల్)

నల్లకుంట: మెడికల్ షాప్‌లో మందుల కోసం వెళ్తున్నానని భార్యతో చెప్పి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కోయల్ కార్ రాజశేఖర్ (36) భార్య కేవల్ (32) కుమార్తెతో కలిసి నల్లకుంట శివానంద్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. అనారోగ్యం కారణంగా మందుల కోసం ఈనెల 4న ఉదయం 9.40 గంటలకు మందుల దుకాణానికి వెళ్లి తిరిగిరాలేదు. భర్తకు ఫోన్ చేసినా ఎలాంటి సమాచారం లభించలేదు. దీంతో ఆమె శుక్రవారం సాయంత్రం నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఫలక్‌నుమా రైల్వే యార్డ్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి (20) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాతనేరస్తుడి అరెస్ట్..

కాచిగూడ: వివిధ నేరాలకు పాల్పడిన ఓ పాత నేరస్తుడిని రైల్వే పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. తప్పించుకుని తిరుగుతున్న మైలార్‌దేవ్‌పల్లికి చెందిన పాతనేరస్తుడు ఆటో డ్రైవర్ ఎం.డీ ఇమ్రాన్‌ను కాచిగూడ రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు.

చిన్నారితో సహా తల్లి అదృశ్యం



స్వప్న (ఫైల్)



అదృశ్యమైన 21 నెలల చిన్నారి

నల్లకుంట: భార్యభర్తల మధ్య ఘర్షణతో 21 నెలల కుమార్తెతో ఓ తల్లి అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం .. సదాల సాయినాథ్, ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న భార్య స్వప్న (31), 21 నెలల కుమార్తెతో కలిసి శంకరమఠం పద్మాకాలనీలో నివాసముంటున్నాడు. పెళ్లైన నాటి నుంచే భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సాయినాథ్ భార్యపై చేయిచేసుకున్నాడు. దీంతో విసిగిపోయిన ఆమె గత నెల 28న 21 నెలల కూతురుని తీసుకుని మల్కాజ్‌గిరి మిర్జాల్‌గూడలోని పుట్టింటికి వెళ్లిపోయింది. ఆమె తండ్రి కుమార్తెకు సర్ది చెప్పి ఈ నెల 4న తిరిగి ఇంటి వద్ద వదిలివెళ్లాడు. శుక్రవారం కుమార్తెకు ఫోన్ చేయగా.. ఆమె నుంచి ఎలాంటి స్పందన రాలేదు. శనివారం పద్మాకాలనీకి వచ్చి చూడగా ఇంటికి తాళం వేసి ఉంది. అల్లుడికి ఫోన్ చేయగా ఎలాంటి స్పందన రాలేదు. దీంతో నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ మేనిఫెస్టోలో గౌడ్‌ల సమస్యలను చేర్చాలి



అంజన్‌కుమార్‌యాదవ్‌ను సన్మానిస్తున్న గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ సభ్యులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో గౌడల సమస్యలు, సంక్షేమాన్ని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరచాలని కోరుతూ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్‌కు తెలంగాణ గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌనీ బాలరాజ్‌గౌడ్, రాష్ట్ర కన్వీనర్ వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ విజయ్‌కుమార్‌గౌడ్‌లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంజన్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. వారు మాట్లాడుతూ.. గౌడ జనాభా ప్రకారం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, రాజ్యసభ, లోక్‌సభ సీట్లను కేటాయించాలన్నారు. వైన్స్, బార్‌లలో 50 శాతం గౌడ్‌లకు కేటాయించాలని కల్లుగీత కార్పొరేషన్‌కు రూ.50 వేల కోట్లు కేటాయించాలన్నారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పేరును జనగామ జిల్లాకు పెట్టాలని కోరినట్లు సమాచారం.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: పేదల వైద్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ఎంతో భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్యే కా లేరు వెంకటేష్ అన్నారు. శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో 6 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.2.46 లక్షల చెక్కులను అందజేశారు. అన ంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా తోడ్పాటును అందిస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తం అందించేందుకు అన్ని వేళల సిద్ధంగా ఉన్నామన్నారు. లబ్ధిదారులతో పాటు స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సత్యదీప్తికి సత్కారం

చిక్కడపల్లి: మధురమైన హిందీ తెలుగు పాటలను ప్రతిభావంతులైన గాయనీగాయకులు ఆలపించి శ్రోతలను ఆకట్టుకున్నారు. శనివారం రాత్రి ప్రముఖ సంగీత సంస్థ సుబ్బు మ్యూజిక్ అకాడమీ నిర్వహణలో త్యాగరాయగానసభ ప్రధాన వేదికపై శ్రీధర రామసుబ్రహ్మణ్యం వాగ్దేవు సత్యదీప్తితో కలిసి తమిళ, తెలుగు హిందీ పాటలను గానం చేశారు. అపర్ణ, రాజు, ఉదయ్ భాస్కర్, లలిత, తదితరులు పాటలు పాడి అలరించారు. ఎంఎస్ఎన్ రావు, కె.శ్రీనివాస్‌రావు, వంశీ రామరాజులు తదితరులు సత్యదీప్తిని సత్కరించి సుస్వరగాన మాధురి బిరుదుతో సత్కరించారు.



సత్కరిస్తున్న శ్రీధర రామసుబ్రహ్మణ్యం తదితరులు

పాట్నా హైకోర్టు స్టే బీసీల మనోభావాలను కించపరచడమే..!



తాటికొండ విక్రమ్‌గౌడ్

కవాడిగూడ: బీహార్‌లో కుల గణాంకాలపై పాట్నా హైకోర్టు స్టే ఇవ్వడం బీసీల మనోభావాలను కించపరచడమేనని బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్‌గౌడ్ ఆరోపించారు. శనివారం దోమలగూడ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 2021లో జరగాల్సిన వెనుకబడిన కులాల జనాభా లెక్కల సేకరణ కరోనా కారణంగా కేంద్ర ప్రభుత్వం వాయిదా వేస్తూ.. వస్తోందన్నారు. దేశంలోనే మొట్టమొదటి సారిగా బీహార్ సీఎం నితీష్‌కుమార్ ప్రతిపక్షాలతో ప్రధాని మోదీని కలిసి కులగణాంకన జరపాలని విన్నవించామన్నారు. కేంద్ర ప్రభుత్వం నేటికి కులగణన చేయకపోవడం దురదృష్టకరమన్నారు.

- మొదటి సారిగా బీహార్ సీఎం రాష్ట్రంలో కులగణన చేయాలని నిర్ణయించారన్నారు. దీనిపై పట్నా హైకోర్టు స్టే ఇవ్వడం బాధాకరమన్నారు. – 90 ఏళ్ల క్రితం బ్రిటీష్ కాలంలో 1931లో జరిగిన జనాభాగణన కులాల వారిగా చేశారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కులగణన జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు.
- మండల్ కమిషన్ సిఫారసుల్లో భాగంగా ఎస్సీ, ఎస్టీ తరహాలో ఓబీసీలకు రాజకీయంగా కూడా రిజర్వేషన్లు కల్పిస్తూ.. నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఓబీసీలకు జరిగే అన్యాయంపై రాబోయే రోజుల్లో జాతీయ స్థాయిలో బీసీలు ఏకమై బీసీల జనాభా లెక్కలపై ఉద్యమిస్తారని హెచ్చరించారు.

కచ్చా మోరీల్లో పూడికతీత పనులు




పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్

కాచిగూడ: వర్షపు నీరు సక్రమంగా వెళ్లేందుకు కచ్చా మోరీల్లో పేరుకుపోయిన పూడికతీత పనులను జీహెచ్‌ఎంసీ కాచిగూడ డివిజన్ వెంకటరమణ థియేటర్ లైన్, జైన్‌మందిర్ లైన్ తదితర ప్రాంతాల్లో శనివారం చేపట్టింది. కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ జీహెచ్‌ఎంసీ సిబ్బంది, అధికారులతో కలిసి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని కాలనీల్లో పాదయాత్ర నిర్వహించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కరించడంలో అధికారుల నిర్లక్ష్యం సరికాదన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆమె పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ ఏఈ కార్తిక, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాము, నరేష్, బీజేపీ నేతలు సుభాష్ పటేల్, బల్వీర్, మిలింద్, బి.భీమ్ రాజ్, ఓంప్రకాష్, సంతోష్, రవియాదవ్, సూరి తదిరతులు పాల్గొన్నారు.

'నిరుద్యోగ భరోసా'కు వేలాదిగా తరలిరావాలి..



ఎం.అనిల్‌కుమార్‌యాదవ్



లక్ష్మణ్‌యాదవ్

ముషీరాబాద్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనతో ఆందోళన చెందుతున్న రాష్ట్రంలోని నిరుద్యోగులకు భరోసా కల్పించేందుకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 8న సరూర్‌నగర్‌లో జరిగే నిరుద్యోగుల భరోసా సభకు నగరంలోని నలు మూలలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులు, యువత పాల్గొనాలని యూత్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్‌యాదవ్ కోరారు. శనివారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా వారి జీవితాలతో చెలగాటమాడుతోందని ఆరోపించారు. ఈ సభను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

'యువ సంఘర్షణ సభ'ను విజయవంతం చేయాలి

కాచిగూడ: రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విద్యార్థి, నిరుద్యోగ వ్యతిరేక విధానాలపై ప్రశ్నపత్రాల లీకేజీలకు నిరసనగా ఈనెల 8న సరూర్‌నగర్ స్టేడియంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నాయ కత్వంలో జరిగే 'యువ సంఘర్షణ సభను విజయవంతం చేయా లని టీపీసీసీ ప్రధానకార్యదర్శి ఆర్.లక్ష్మణ్ యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం అంబర్‌పేట నియోజకవర్గంలోని కాచిగూడ, గోల్నాక డివిజన్లలో పాదయాత్ర నిర్వహించి ఇంటింటికి వెళ్లి సభకు రావాలని ప్రజలను కోరారు.

ఘనంగా అన్నమాచార్యుల జయంత్యుత్సవాలు



అనుగ్రహ భాషణం చేస్తున్న త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి

కవాడిగూడ: అన్నమాచార్య సంకీర్తనలను ఆలపిస్తూ విశ్వవ్యాప్తం చేయడానికి పద్మశ్రీ డాక్టర్ శోభరాజు చేస్తున్న కృషి అభినందనీయమని త్రిదండి అహోబిల జీయర్ స్వామి అన్నారు. శనివారం అన్నమయ్య 615 జయంతిని పురస్కరించుకుని అన్నమాచార్య విగ్రహం మహానగర సంకీర్తన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జీయర్ స్వామి అన్నమయ్య విగ్రహం వద్ద పద్మరాజు డాక్టర్ శోభరాజుతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి సందేశం ఇచ్చారు. పద్మశ్రీ డాక్టర్ శోభరాజు, డాక్టర్ నందకుమార్ దంపతులను రామానుజ జీయర్ స్వామి ఘనంగా సత్కరించారు. సత్యవాణి, వేణు, శ్రీరంగం పాల్గొన్నారు.

త్యాగరాయగానసభలో..

చిక్కడపల్లి: త్యాగరాయగానసభలో నిర్వహించిన సంకీర్తనామృత కార్యక్రమం ఆకట్టుకుంది. గాయనీగాయకులు రాగయుక్తంగా పాడి ప్రేక్షకులను అలరించారు. అన్నమయ్య పదకోకిల పద్మశ్రీ డాక్టర్ శోభరాజు శనివారం సాయంత్రం ముఖ్య అతిథిగా హాజరై గాయనీగాయకులను అభినందించి సత్కరించారు.

సంకీర్తనల సామూహిక గానం..

నల్లకుంట: తాళ్లపాక అన్నమాచార్యుల 615వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని నల్లకుంటలోని శ్రీ సాయిశృతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నవరత్నమాల శీర్షికన నిర్వహిస్తున్న అన్నమయ్య సంకీర్తనార్చనల సామూహిక గానం ఆహుతులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. టీవీ, దూరదర్శన్ కళాకారుడు గౌరీభట్ల లక్ష్మణమూర్తి, అకాడమీ డైరెక్టర్ గౌరీభట్ల వసుధామూర్తి, ఈవెంట్ మేనేజర్లు నందిని, యామిని, అకాడమీ విద్యార్థులు పాల్గొన్నారు.